ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
ఆదివారం 29 డిసెంబరు 2024

ప్లాస్టిక్ నిషేధానికి బనగానపల్లె నాంది పలకాలి

మంత్రి, కలెక్టర్, ఎస్పీ పిలుపు



ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, బీసీ ఇందిరమ్మ తదితరులు

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి జిల్లాలో బనగానపల్లె నాంది పలకాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పిలుపునిచ్చారు. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ 'నా బనగానపల్లె, నా ఆరోగ్యం' పేరుతో ప్లాస్టిక్ నిషేధానికి పిలుపునిచ్చారు. దీంతో శనివారం పట్టణంలో మంత్రి జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, ప్రజలు, వివిధ అసోసియేషన్ సభ్యులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బనగానపల్లె మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, కరస్పాండెంట్లు, కిరాణ అసోసియేషన్, మెడికల్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హోటల్ అసోసియేషన్, గోల్డ్ అసోసియేషన్, వివిధ శాఖల అధికారులు పొదుపు మహిళలు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, టీడీపీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాముల కూడలి పాత సిండికేట్ బ్యాంకు, సీఐ కార్యాలయం, ఆ స్థానం రోడ్డు, పెట్రోల్‌బంకు కూడలి మీదుగా ఉన్నత పాఠశాల మైదానం వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఇందిరమ్మ మాట్లాడుతూ సంక్రాంతి నాటికి బనగానపల్లెలో ప్లాస్టిక్ వాడకం ఉండకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రమాణం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై నృత్య ప్రదర్శన చేసిన ఏకే అనిల్ బృందానికి రూ.10 వేలు బహుమతి అందించారు.


బహిరంగ సభలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రమాణం చేస్తున్న మంత్రి, అధికారులు, తదితరులు



పరుగులు తీస్తున్న పారిశ్రామికం





రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం కర్నూలును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరే ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేయలేదు. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా ప్రకటించి ప్రపంచంలోనే అతి పెద్ద వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ యూనిట్, పంప్డ్ స్టోరేజీ పవర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ హబ్‌గా ప్రకటించి.. పలు సిమెంట్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నించారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారంతో నందికొట్కూరులో మెగా సీడ్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. చంద్రబాబు భూమి పూజ చేసిన ఒకటి రెండు పరిశ్రమలు పురుడుపోసుకున్నాయే తప్ప.. ఒక్క కొత్త పరిశ్రమను కూడా జగన్ ప్రభుత్వంలో తీసుకురాలేపోయింది. 2024 జూన్ 12న మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడం.. జిల్లాకు చెందిన టీజీ భరత్ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకుంది. 2024 సంవత్సరంలో ఆరు నెలలు వైసీపీ పాలన.. ఆరు నెలలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో సాధించిన పారిశ్రామిక పురోగతిని విశ్లేషిస్తే..

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు కేంద్రం ఆమోదం
- తొలి దశలో 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి
- జపాన్ సంస్థ సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు
- వైసీపీ హయాంలో పారిశ్రామిక పురోగతి కుదేలు
- 2024లో చంద్రబాబు వచ్చాక పురోగతి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వల్ల మరింత కలిసొచ్చే అవకాశం

కర్నూలు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2014-19 మధ్య ఆనాటి సీఎం చంద్రబాబు పారిశ్రామిక ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. రాయలసీమలో వెంటాడే కరువు, వలసలు నివారించాలంటే పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచాలనే ఏకైక లక్ష్యంతో 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ హబ్, నందికొట్కూరు కేంద్రంగా మెగా సీడ్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆసియాలోనే అదిపెద్ద వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగావాట్లతో నాంది పలికారు. వివిధ రంగాల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపాలంటే విమాన రవాణా సౌకర్యం ఎంతో కీలకమని గుర్తించి చంద్రబాబు 1,010 ఎకరాల విస్తీర్ణంలో కొండలను పిండి చేసి రూ.110 కోట్లతో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. నీటి వసతి కోసం ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 4 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేసేందుకు జలాశయం నిర్మాణం, కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని దూపాడు రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నందికొట్కూరు దగ్గర మెగా సీడ్ హబ్, జైన్ ఇరిగేషన్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక ప్రగతి కలలు కల్లలుగా మారాయి. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రావడం, చంద్రబాబు విజన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారం తోడుకావడంతో పారిశ్రామిక అభివృద్ధి ఆశలు చిగురిస్తున్నాయి. 2024 ఉమ్మడి కర్నూలులో పారిశ్రామిక పురోగతికి వేదిక అయ్యింది.

2,612 ఎకరాలు.. రూ.2,786 కోట్లు

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఈ ఏడాది జూన్ 23న కేంద్రం ప్రకటించడం జిల్లా నిరుద్యోగ యువతలో మరవలేని గుర్తింపును 2024 సొంతం చేసుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్-2024-25లో ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ అభివృద్ధి చేస్తామని కీలక ప్రకటన చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం విడిభాగాలు తయారీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరణాల తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టిందని, ఆయా పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు.


జైరాజ్ స్టీల్ ప్లాంట్ వద్ద మంత్రి టీజీ భరత్ (ఫైల్)

మిగతా 6లో..

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


శ్రీశైలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు చేపట్టింది. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఆలయ ఇంజనీరింగ్, ఉద్యానవన విభాగం, మంచినీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి పలు పార్కింగ్ ప్రదేశాలను, ఆరుబయలు ప్రదేశాలను పరిశీలించారు. గంగాధర మండపం నుంచి దక్షిణ, ఉత్తరం వైపు ప్రధాన రహదారులు, టూరిస్ట్ బస్టాండు, యజ్ఞవాటిక, జడ్పీ ఉన్నత పాఠశాల సమీప ప్రదేశాలు, సాంస్కృతిక కళాప్రదర్శన వేదిక, ఏనుగుల చెరువుకట్ట తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ గంగాధర మండపం నుంచి సర్వదర్శనం క్యూలైన్ వరకు ప్రధాన రహదారికి కుడివైపున దర్శనం కోసం భక్తులు వేచి ఉండేందుకు విశాలమైన షెడ్డును, క్యూలైన్లను, వీటికి ఎదురుగా సామాన్లు భద్రపరుచుకునే గదిని, పాదరక్షలు భద్రపరుచుకునే గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. నందిగుడి ప్రధాన రహదారికి ఇరువైపులా, టూరిస్ట్ బస్టాండు, యజ్ఞవాటిక, జడ్పీ ఉన్నత పాఠశాల సమీప ప్రదేశాలు, సాంస్కృతిక కళాప్రదర్శన వేదిక, ఏనుగుల చెరువుకట్ట పార్కింగ్ ప్రదేశాలలో భక్తులు సేద తీరేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లను, గ్రీన్ మ్యాట్లను, మంచినీటి సదుపాయం, తాత్కాలిక విద్యుదీకరణ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా క్షేత్ర పరిధిలో వీలైనచోట్లంతా ప్రథమ చికిత్స కేంద్రాలు, (మే ఐ హెల్ప్ యూ సెంటర్‌లు) సమాచార కేంద్రాలను, ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా పార్కింగ్ ప్రదేశాలు భక్తులకు స్పష్టంగా తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని శ్రీశైల ప్రభ, ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాలలో బండరాళ్లు, పిచ్చిమొక్కలను తొలగించి, గ్రావెల్ వేయించి, చదును చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలయ అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఎస్పీ


ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పొలిమేరలోని జగన్నాథగట్టు సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు ఈ ఏడాదికి సంబంధించిన ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఈ సాధనలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు పాల్గొని పిస్టల్‌తో ఫైరింగ్ సాధన చేశారు. అలాగే పోలీసు అధికారులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫైరింగ్‌లో సిబ్బంది పాల్గొని మంచి మెలకువలు చేర్చుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమైనవన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ, ఏఎస్పీలతోపాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ లెఫ్ట్ చంద్రబాబు, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, రామంజినాయక్, రవికుమార్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు, నాగభూషణంతోపాటు జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి దర్శనార్థం తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రంలోని నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు వసతి, అన్నదానం నిర్వహించి భక్తుల సేవలో తరించారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉంది. దర్శనార్థం శ్రీశైలం విచ్చేసే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం తదితర ఆర్జిత సేవా టిక్కెట్లను దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా పొంది శ్రీశైలం రావాలని అధికారులు చెప్పారు.


క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

తుంగభద్ర తీరం సాహిత్యం





'కర్నూలు జిల్లా జానపద కథలు' పుస్తకం

అపురూపం.. జానపద కథనం

- బాలల ఊహా ప్రపంచాన్ని ఉత్సాహపరిచే పుస్తకాలు
- డాక్టర్ ఎం. హరికిషన్ వినూత్న ప్రయోగం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కథ చదివితే గుర్తుండి పోవాలి. చివరి దాకా ఆసక్తిగా ఉండాలి. ఉత్సుకత రేకెత్తించాలి. ఆ తర్వాత మరో పదుగురికి ఆ కథను చెప్పుకునే కథనం ఉండాలి. ఏ కథకైనా జీవ లక్షణం ఇదే. జానపద కథలు చాలా ఉత్సాహంగా చదవిస్తాయి. అందులోని మాయ మంత్రాలు, కథానాయకుల సాహసాలు, ఊహలకు అందని మలుపులు బాల్యంలో చదువుకున్నా, ఎప్పటికీ మదిలో ఉండిపోతాయి. అలాంటి కథల పుస్తకమే కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ రాసిన 'కర్నూలు జిల్లా జానపద కథలు'. ఈ పుస్తక రచనకు ముందు ఆయన 12 ఏళ్ల జిల్లా నలుమూలలు తిరిగారు. గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మమ్మలతో, నాయనమ్మలతో మాట్లాడి ఈ కథలన్నీ తెలుసుకున్నారు. ఆ కథలు ఉన్నది ఉన్నట్లుగా కాకుండా కేవలం మూల కథను మాత్రమే తీసుకొని, సంభాషణలు, సంఘటనలను పునర్నిర్మిస్తూ ఆసక్తి రేకెత్తించేలా రాశారు. అలా పెద్దల ద్వారా, పిల్లల ద్వారా సేకరించి రచించిన అద్భుత జానపద కథల పుస్తమే ఇది. ఆధునిక జీవితంలో పిల్లలకు కథలు చెప్పే పెద్దవారు లేరు. ఈ తరుణంలో అలనాటి అపురూప జానపద కథల ఖజానాను నేటి బాలలకు అందించారు రచయిత డాక్టర్ ఎం. హరికిషన్. కర్నూలు బుక్ ట్రస్టు ద్వారా 121 కథలతో వెలువడిన ఈ పుస్తకం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ పొందడంతో దీప్తి పబ్లికేషన్స్ ద్వారా రెండో ముద్రణ పొంది, 'తెలుగు వారి జానపద కథలు' రూపంలో వెలువడింది. ప్రస్తుతం మూడో ముద్రణకు కూడా సిద్ధంగా ఉంది. ఈ పుస్తకం విశాలాంధ్ర, నవోదయ పబ్లికేషన్స్‌తోపాటు అన్ని ప్రముఖ పబ్లికేషన్స్ స్టాళ్లలో అందుబాటులో ఉంది.



'తెలుగు వారి జానపద కథలు' పుస్తకం


పల్లె.. నా కలల సౌందర్యం

- ఎస్ఆర్ మందిరాజు, కర్నూలు



వాన చినుకు నేలను
ముద్దాడినప్పుడు
వచ్చే కమ్మని మట్టి వాసన
ఆఘ్రాణించావా...?
చెట్టై ఎదిగి పదుగురికి నీడ
ఇచ్చేందుకు
నేలను చీల్చుకొని విత్తు చూస్తున్న
పోరాటం చూశావా..?
ఆకుపచ్చని తివాచీని ఒళ్లంతా
కప్పుకున్నట్లు
హరిత వర్ణశోభితమై మెరుస్తున్న
పచ్చటి పొలాల సొగసును చూశావా..?
చిరుగాలికి తలలూపుతూ పలుకరించే
గడ్డిపూల సోయగాన్ని ఆస్వాదించావా..?
గరిక పరకలపై కరిగిపోతున్న మంచు
నీరవాన్ని వీక్షించావా..?
గూళ్ల నుంచి ఆహారాన్వేషణకు బయలు
దేరిన పక్షుల కిలకిలారావాలు
పూల సొగసుకు మురిసే తుమ్మెదల
ఝుంకార ధ్వనులు
గోధూళి వేళలోని ఆలమందల మెడల్లోని
చిరు మువ్వల నాదాలు
వీనుల విందు చేసే ఈ పల్లె సీమల్లోని
జుగల్‌బందీ విన్నావా..?
పంట కాలువ గట్టుపై కూర్చొని
చద్దన్నం తింటూ
పైరగాలికి ఎగిరే ముంగురులను
సర్దుకుంటూ
అమ్మ చెప్పే చిన్ననాటి కబుర్లు
అన్నదమ్ములమంతా వింటూ...
ఎంత కాలమైందో...కదా మనమంతా
కలిసి బతికి..
'ఏరా' అనే పలకరింపులో తొంగి చూసే
ఆత్మీయత
'రారా' అనే పిలుపులోని ఆప్యాయత
ఇది మన ఊరి వారికే కదా సొంతం...
ఊరివారంతా మనకే అన్న భావన
మనకే అసొంతం
ప్రపంచీకరణలో విశ్వమే కుగ్రామం
బతుకు బాటలో ఆ కుగ్రామమే మనకు
దూరం
అందుకే వచ్చే సంక్రాంతి వేళ పట్నం
వీడి పల్లెను చేరాలి...
పల్లెలో ప్రతి అణువునూ
తనివితీరా ఆస్వాదించాలి...!

నగరంలో నేడు



- నగర శివారు మామిదాలపాడులోని శ్రీగోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకులం)లో ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉదయం 4.30 నుంచి విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం 11.45 గంటలకు గత ఏడు రోజులుగా ఆలయంలో చేపట్టిన అఖండ విష్ణు సహస్ర నామ పారాయణ సప్తాహం ముగుస్తున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు.
- బళ్లారి రోడ్డులోని వాసవీనగర్‌లోగల శ్రీవేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉదయం 7 గంటలకు తిరుప్పావై పారాయణం, ప్రత్యేక ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నారు.
- రెవెన్యూకాలనీలోని భరతమాత మందిరంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 6 గంటలకు ధనుర్మాసం పూజలు, తిరుప్పావై పారాయణం చేస్తున్నారు.
- కల్లూరులోని శ్రీ అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ మందిరంలో ఉదయం 9 గంటలకు 'నూతన సంవత్సర క్యాలెండర్' ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి తెలిపారు.
- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు హిందీ చలన చిత్ర నటుడు రాజ్‌కపూర్ శతజయంతి వేడుకల్లో భాగంగా రాజ్‌కపూర్ పాటలతో 'మ్యూజికల్ నైట్' ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు సిరాజ్ తెలిపారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించ కుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

పరుగులు తీస్తున్న పారిశ్రామికం



ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య నిర్మిస్తున్న పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాలో పట్టాలెక్కనున్న పరిశ్రమలు

- జాతీయ పశు ఆరోగ్యం, వ్యాధి నియంత్రణ కార్యక్రమం (ఎన్ఏడీసీపీ)లో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు దృష్టి సారించారు. ఈ పశుక్షేత్రంలో పశుసంవర్ధక శాఖ నుంచి ఎన్ఏడీసీపీకి 100-150 ఎకరాలు కేటాయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశు క్షేత్రంలో మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోనిలో 3, కర్నూలులో 4, నంద్యాలలో 3 కలిపి 10 మాతృభాషలో ఎఫ్ఎం ఛానల్స్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.14 వేల కోట్లతో భారీ సెమి కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జపనీస్ సంస్థ, భారత్‌కు చెందిన మరో ఐటీ సంస్థ భాగస్వామ్యంతో కలసి ఏర్పాటు చేయనున్నారు. 130 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం జపాన్ ప్రతినిధులు ఇప్పటికే ఓర్వకల్లును పరిశీలించారు.
- ఓర్వకల్లు మండలం పాలకొలను, చింతలపల్లి, కొమరోలు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో 'డ్రోన్ తయారీ పరిశ్రమ' ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే డ్రోన్ తయారీ పరిశ్రమ ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు.

ప్రారంభానికి సన్నాహాలు

పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజ్) విద్యుత్ సబంధించిన ఇంటిగ్రేటెట్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్ఈపీ)కు శ్రీకారం చుట్టారు. పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల్లో 4,750 ఎకరాల భూములు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని కేటాయించారు. ప్రాజెక్టు రూ.15 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యం. వైసీపీ ఆయాంలో పనులు మందగించినా.. టీడీపీ కూటమి వచ్చాక వేగం పుంజుకుంది. దాదాపు 85 శాతానిపై పనులు పూర్తయ్యాయి. 2025 నూతన సంవత్సరంలో ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



పరిశ్రమలపై వైసీపీ దాడులు:

టీడీపీ కూటమి పరిశ్రమలు తీసుకొచ్చి రాయలసీమ గమనాన్నే మార్చాలి.. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇందుకు విరుద్ధంగా వైసీపీ నాయకులు పరిశ్రమలపై దాడులు చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఈ ఏడాది అక్టోబరు 3న ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బసినె విరుపాక్షి సోదరుడు, మరికొందరు వైసీపీ కార్యకర్తలు ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల్లో వపన విద్యుత్తు (విండ్ వపర్) స్టేషన్లు, కార్యాలయాలపై దాడులు చేసి ఫర్నీచర్, కంప్యూటర్లు ధ్వంసం చేశారు. కిటికీల అద్దాలు పగులుగొట్టి విధ్వంసం సృష్టించారు. ఇలా చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టీజీ భరత్ పరిశ్రమల శాఖ మంత్రి కావడం కలిసొచ్చిన అవకాశం

జిల్లాకు చెందిన కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కావడం ఉమ్మడి కర్నూలులో పరిశ్రమలు ఏర్పాటుకు కలిసొచ్చిన అవకాశం అని పలువురు అంటున్నారు. స్వయంగా యువ పారిశ్రామి కవేత్త కావడంతో రాష్ట్రానికి, ముఖ్యంగా జిల్లాకు వివిధ పరిశ్రమలు తీసుకురావడంతో టీజీ భరత్ కృషి ఎంతో ఉంది. అదే క్రమంలో రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో బయో గ్యాస్ ప్రాజెక్టులు ఏర్పాటుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందుకు రావడంపై పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కృషి అభినందనీయం అని సీఎం చంద్రబాబు కొనియాడారంటే టీజీ కృషి ఏమిటో తెలుస్తుంది. ఈ ఏడాదే పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం, కీలకమైన పరిశ్రమలు జిల్లాకు తీసుకురావడంతో 2024కు మరవలేని గుర్తింపు వస్తుంది.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన మహనీయుడు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గానూ, ఆర్థిక మంత్రిగానూ, దేశ ప్రధాన మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు సంస్కరణలు చేపట్టి సంక్షోభం నుంచి గట్టెక్కించడమే కాకుండా ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం విడిపోతే రాయలసీమకు జరిగే అన్యాయన్ని మన్మోహన్‌సింగ్‌కు వివరిస్తే దానికి ఆయన స్పందిస్తూ వెనుకబాటుకు గురైన రాయలసీమకు అన్యాయం జరగనీయబోమని హామీ ఇచ్చారని టీజీ చెప్పారు. రాయలసీమ అభివృద్ధికి, రాయలసీమ హక్కుల ఐక్యవేదిక కోరిన ప్రజల పలు డిమాండ్లను నెరవేర్చి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై తన చిత్తశుద్ధిని మన్మోహన్ నిరూపించుకున్నారని అన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

ఓర్వకల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 2025 పరీక్ష పే చర్చను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న గల్లీ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలనుకున్నట్లయితే విద్యార్థులకు అద్భుత అవకాశం ఉందని, అందుకోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జనవరిలో నిర్వహించే 8వ ఎడిషన్ పరీక్ష పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని చెప్పారు. నన్నూరు సమీపంలో బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలను సందర్శించి మ్యాథ్స్ డే సెలబ్రేషన్‌లో పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ

అలుపెరగని అంకయ్య



శ్రీకృష్ణ పాత్రధారిగా..

పదకొండేళ్ల ప్రాయం నుంచి నటన, నాటకం పంచప్రాణాలుగా భావిస్తూ చదువులో దూసుకుపోయిన ఆయన బీకాం డిగ్రీ పూర్తి చేశారు. డిగ్రీ కళాశాలలో చేరేందుకు డబ్బు లేకపోయినా ఆయనలోని కళాప్రతిభను గుర్తించిన ప్రిన్సిపాల్ మూడేళ్లు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించారు. అనంతరం పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరి 20 ఏళ్లు సుమారు 9 మండల స్టేషన్లలో ఎస్ఐగా పనిచేసి అధికారుల ప్రశంసలతో పదవీ విరమణ చేశారు. ఇటు నాటక రంగంలో ఆరు దశకాలు పూర్తి చేశారు. ఆయనే కర్నూలుకు చెందిన ప్రముఖ పౌరాణిక పద్య నాటక కళాకారుడు, ఈలపాట గాయకుడు, నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గంగుపల్లి గ్రామంలో 1950 జూలై 1న జన్మించిన అంకయ్యది పెద్ద వ్యవసాయ కుటుంబం. ఇంట్లో ఉన్న బర్రెలు కాసేవారు లేక, పదేళ్ల బాల్యంలో వాటిని మేతకు తోలుకు వెళ్లడం దినచర్యగా ఉండేది. గ్రామంలో వేస్తున్న రామాయణం నాటకంలో కుశుని పాత్రకు బాల కళాకారుడు కావాల్సి వచ్చింది. అప్పుడు ఓ చిన్న పద్యంతో మొదలైన ఆయన ప్రస్థానం నేటివరకూ కొనసాగుతోంది.

- పద్యనాటకాలతో గుర్తింపు
- జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు సొంతం
- ఆరు దశాబ్దాలుగా నాటక రంగంలో రాణిస్తున్న గుర్రపుశాల అంకయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ చదువుకు గ్రామం నుంచి 5 కి.మీ.దూరంలోని ఏనుగులదిన్నెపాలెం వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. అలా నిత్యం పది కి.మీ. నడుస్తూ నడక అలుపు రాకుండా రామాయణం, శ్రీకృష్ణ రాయబారంలోని పద్యాలను ఆలపిస్తూండేవాడు. ఏ రాగం ఏస్థాయిలో పాడాలి, ఏ రాగానికి ఎంత శృతి ఉండాలి వంటివి నేర్చుకొని నటించిన పాత్రలన్నీ మెప్పించి తనదైన జిల్లా నాటక రంగంపై తనదైన ముద్ర వేశారు. పౌరాణిక పాత్రలైన శ్రీకృష్ణ, శ్రీరామ, కార్యవర్థిరాజు (బాలనాగమ్మ), ధర్మరాయుడు (బొబ్బిలి యుద్ధం), బృహస్పతి (తారా శశాంకము), రామభద్ర కవి (భువన విజయము), షిరిడీ సాయిబాబా (సాయి లీలలు) ఆంజనేయుడు తదితర వేషాలు ధరించారు.

'ఈలపాట'లో మేటి...

'ఈలపాట' ఆలపించడంలో అంకయ్య గుర్తింపు పొందారు. సినీ పాటలు, రంగస్థల పద్యాలతోపాటు, అనేక శ్లోకాలు, ప్రార్థనలు వంటివి ఈలపాట ద్వారా పాడి ప్రేక్షకుల్లో ఈలపాట అంకయ్యగానూ ప్రాచుర్యం పొందారు. పోలీసు శాఖలో పని చేస్తున్న కాలంలో సాంఘిక దురాచారాలపై సుమారు 200 పైగా ప్రదర్శనలు చేసి, నాటి డీజీపీ, ఎస్పీల చేత ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



2015లో తిరుపతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నంది అవార్డు తీసుకుంటున్న అంకయ్య

సాధించిన పురస్కారాలు

1995లో హైదరాబాదు త్యాగరాజ గానసభలో చింతామణి నాటకంలో బిల్వ మంగళుడు పాత్రకు నట ప్రవీణ బిరుదు పొందారు.

2002లో హైదరాబాదు రవీంద్రభారతిలో శ్రీరాముని పాత్రకు ఈలపాట రఘురామయ్య అవార్డు.

2008 తుంగభద్ర పుష్కరాల్లో నాటి కలెక్టర్ నుంచి ఉత్తమ నటుడిగా గుర్తింపు.

2013లో తిరుపతిలో బభ్రు వాహన విజయం నాటకంలో శ్రీకృష్ణ పాత్రకు ఉత్తమ నటుడిగా బంగారు గరుడ అవార్డు.

2015లో రాజమండ్రిలో జరిగిన నంది నాటక పోటీల్లో శ్రీకృష్ణ పాత్రకు ఉత్తమ నటుడిగా బళ్లారి రాఘవ నంది అవార్డు.

2016లో ఒంగోలులో జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ పోటీల్లో కర్ణార్జునీయం నాటకంలో శ్రీకృష్ణపాత్రకు ఉత్తమ నటుడిగా ఎన్టీఆర్ అవార్డు.

2017లో కర్నూలులో జరిగిన నంది నాటక పోటీల్లో శ్రీకృష్ణ భీమసేనమ్ నాటకంలో శ్రీకృష్ణ పాత్రకు నటుడిగా జ్యూరీ నంది అవార్డు.

2017లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఉత్తమ నటుడు అవార్డు.

2024 తణుకులోని షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం పురస్కారం లభించింది.



2016లో నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం

పద్య నాటకాలకు ఆదరణ పెరగాలి

'కావ్యేషు నాటకం రమ్యం' అని కావ్యాలకంటే నాటకాలు రమ్యంగా ఉంటాయని శాకుంతల నాటకంలో ఏనాడో చెప్పారు. ఒకప్పుడు పద్య నాటకాలు, తర్వాత సాంఘిక నాటకాలకు రాష్ట్రం పుట్టినిల్లు. తర్వాతే ఇతర కళలు ఆదరణ పొందేవి. కానీ మారుతున్న కాలంలో నాటక రంగం చాలా వెనక్కు వెళ్లిపోతోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలకు ఆదరణ కల్పించాలి. ముఖ్యంగా మన తెలుగు పద్య నాటకాలకు ఆదరణ పెరిగేలా కార్యక్రమాలు ఏర్పాటు చేసి కళాకారులను ప్రోత్సహించాలి. -గుర్రపుశాల అంకయ్య



షిరిడీ సాయి పాత్రలో..

చెరువులను నింపకపోవడం సిగ్గుచేటు

- ఇరిగేషన్ అధికారులపై జడ్పీ చైర్మన్ ఆగ్రహం
- ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 77 చెరువులను, అలాగే రిజర్వాయర్లను నింపలేకపోవడం సిగ్గు చేటని, వరద నీళ్లు సుమారు 2000 టీఎంసీలు వస్తే కూడా నింప డంలో విఫలమయ్యారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని జడ్పీ మినీ సమావేశం భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహిం చారు. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి.నాసరరెడ్డి పర్యవేక్షిం చారు. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కేవలం 1.50 టీఎంసీల నీటితో 77 చెరువులను నింపే ఆస్కారం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని మేజర్ పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. నాసిరకం విత్తనాలను అరికట్టాలన్నారు. గ్రామాల్లో కూలీలు ఖాళీగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగ దీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీలు ఏమన్నారంటే...

పర్మినెంటు పంచాయతీ కార్యదర్శులను నియమించాలని వెల్దుర్తి, ప్యాపిలి జడ్పీటీసీలు కోరారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం సచివాల యంలో సిబ్బంది కొరత ఉందని జడ్పీటీసీ అన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులు జనవరి 15 తర్వాత ప్రారంభించాలని ప్యాపిలి జడ్పీటీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఓర్వకల్లు ఆసుప త్రిలో స్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జడ్పీటీసీ చెప్పారు. మిడ్తూరు-గార్గేయపురం రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించలేదని, నందికొట్కూరు-పగిడ్యాల ప్యాచ్ పనులు ఇంకా ప్రారంభంకాకపోవడం సరికాదని జూపాడుబంగ్లా జడ్పీ టీసీ అన్నారు. మహానంది నుంచి గాజులపల్లె రోడ్డు వేయాలని జడ్పీ టీసీ, మద్దికెర నుంచి గుంతకల్లు మధ్య కసాపురం వరకు గత ప్రభు త్వంలోనే టెండరు వేసిన రోడ్డు పనులు ప్రారంభంకాలేదని జడ్పీటీసీ, గడివేముల నుంచి మంచాలకట్ట రోడ్డు పూర్తిగా గుంతలమయం గా మారిందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జడ్పీటీసీ కోరారు.



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి


- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ



కర్నూలు పార్లమెంటు పరిధిలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్ర మంత్రితో సంప్రదించి వాటిని మంజూరు చేయిస్తాను. పంచలింగాల గ్రామంలో మైనార్టీ పాఠశాల ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ముస్లిం స్మశానా లకు ప్రహరీ నిర్మించాలి. పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచేందుకు ప్రతిపాద నలు సిద్ధం చేయాలి. యునాని మెడిసిన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర మంత్రితో చర్చిస్తాను.

కమ్యూనిటీ భవన నిర్మాణాల్లో జాప్యం వద్దు

- గిత్తా జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే



నందికొట్కూరు నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాల నిర్మాణంలో అధికా రులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఏమైనా అడిగితే సైట్ దొరకలేదని సమాధానం చెబుతున్నారు. అధికారులు సొంత నిర్ణ యాలు తీసుకుంటే సరిపోదు. 2017-18 సంవత్సరంలో నియోజకవర్గంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూర య్యాయి. అవి ఏ దశలో ఉన్నాయో వివరాలు ఇవ్వాలి. ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతు న్నాయి. ఇచ్చిన పనులు సకాలంలో పూర్తి చేయాలి.

నేటి నుంచి జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు నేటి నుంచి ఎమ్మిగనూరులో ప్రారంభం కాను న్నాయి. రెండు రోజులపాటు జరిగే మహాసభలకు నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాసభల్లో భాగంగా మొదటి రోజు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. పట్టణంలోన ర్యాలీ, స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం దగ్గర బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఎర్రజెండాలతో తోరణాలు కట్టారు. మహాసభ లను జయప్రదం చేయాలని జీపులో గ్రామాల్లో ప్రచారం చేశారు. మోటర్ బైక్‌లపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

చిరుత సంచారం

మహానంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహానంది మండల పరిధిలోని వ్యవసాయ కళాశాల భూమిలో శనివారం చిరుత ప్రత్యక్షం అయ్యింది. దీంతో పొలంలో పనులు చేస్తున్న కూలీలు పరుగులు తీసారు. స్థానిక ఉద్యానవన పరిశోధన స్థానం పరిసరాల్లోని వ్యవసాయ కూలీలు పనులు ముగించుకొని మధ్యాహ్నం భోజనం చేస్తుండగా సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం నుండి చిరుత పులి ప్రత్యక్షం కావడంతో భయ భ్రాంతులకు గురై పరుగులు తీశారు.

అప్పుల బాధతో వృద్ధ రైతు ఆత్మహత్య

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తహసీల్దార్

కొత్తపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో కొత్తపల్లి మండలం లింగాపురం గ్రామానికి చెందిన రైతు చిమ్మె నడిపి మారెన్న (70) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చిమ్మె నడిపి మారెన్నకు ఇద్దరు భార్యలు కాగా, పెద్ద భార్యకు ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు. ఇద్దరు భార్యలు అనారోగ్యంతో ఇది వరకే మరణించారు. మృతునికి ఏడె కరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ సరైన పంటలు రాక అప్పులపాల య్యాడు. పిల్లల చదువులు, ఇంటి నిర్మాణం కోసం సుమారు రూ.10ల క్షల మేర అప్పు చేశాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మాన సిక వేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లోని క్రిమిసంహారక మందును తాగాడు. అపస్మారక స్థితిలో వెళ్లిన మారెన్నను కుమారులు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి మృతుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. మృతుని పెద్ద కుమారుడు అల్లెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఏఎస్ఐ బాబా ఫకృద్దీన్ తెలిపారు.

కొమ్ముచెరువులో కర్నూలు వాసి..

ఓర్వకల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని గీతానగ ర్‌కు చెందిన ఉప్పర శివన్న(57) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయ టికి వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం మండలంలోని కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దేవస్థానం సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్నట్లు పోలీ సులు గుర్తించారు. శనివారం మృతుడి భార్య ఉప్పర పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

కోర్టు భవనాల పరిశీలన



బనగానపల్లె కోర్టును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): గత 120 ఏళ్ల క్రితం నవాబుల కాలంలో నిర్మించిన బనగానపల్లె కోర్టు భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది శనివారం పరిశీలించారు. కోర్టు భవనం శిథి లావస్థకు చేరుకోవడంతో పరిపాలన సౌలభ్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు న్యాయవాదులు ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. గతవా రంలో బనగానపల్లె న్యాయవాదులు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలసి బనగానపల్లె కోర్టు భవనం అధ్వానస్థితిలో ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు జిల్లా జడ్జితో పాటు బనగానపల్లె ఇన్‌చార్జి న్యాయ మూర్తి అబ్దుల్ రహమాన్ కోర్టు భవనాన్ని పరిశీలించారు. గతంలో నవాబు కాలంలో నిర్మించిన భవనాన్ని ఆర్కియాలజీవారు స్వాధీనం చేసు కోవడంతో వాటిని శిథిలం చేయకుండా పక్కనే ఉన్న స్థలంలో నిర్మించేం దుకు ఎస్టిమేషన్లు పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించి కోర్టు భవ నాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసో సియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, సెక్రటరీ జేమ్స్, సీనియర్ న్యాయవా దులు పరశురామిరెడ్డి, యూసుఫ్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీరింగ్ రాడ్ ఊడి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



స్టీరింగ్ ఊడిపడడంతో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

ఆస్పరి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైరుప్పల గ్రామ సమీపంలో పత్తి కొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం స్టీరింగ్ రాడు ఊడి అదుపు తప్పింది. పత్తి కొండ నుంచి ఎమ్మిగనూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కైరుప్పల గ్రామ సమీపంలో స్టీరింగ్ రాడు ఊడిపోయింది. అదే సమయంలో గోనెగండ్ల మండలం బైలుపల గ్రామానికి చెందిన పెద్దయ్య తన స్వగ్రామం నుండి పత్తికొండ వెళ్తున్నాడు. స్టీరింగ్ రాడ్ ఊడి పోవడంతో బస్సు టైరు పెద్దయ్య మీదికి దూసుకెళ్లి కుడికాలుపై వెళ్ల డంతో గాయడ్డాడు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గోరంట్ల (ఫైల్)

గోనెగండ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్‌కైరవాడి, పెద్దనేల టూరు గ్రామాల మధ్య ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల దగ్గర గోరంట్ల(25)అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దనేల టూరు గ్రామానికి చెందిన గోరంట్ల పెయిం టింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే గోరంట్ల గత కొన్ని నెలలుగా గోనెగం డ్లలోని ఓ దుకాణంలో పెయింటర్‌గా పనిచే స్తున్నాడు. రోజు మాదిరే గోనెగండ్లకు వచ్చాడు. పరిచయస్థుల వివాహం జరుగుతుండటంతో హాజరై సాయంత్రం తిరిగి తన స్వంతగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. హెచ్‌కైరవాడిలో జడ్పీ హైస్కూల్ వద్ద బైకు ముందు టైర్ పగిలి పోయి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోరంట్లకు భార్య శృతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. యువకుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర తెలిపారు.

కర్ణాటక డ్రైవర్..

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండ లంలోని దద్దనాల ప్రాజెక్టు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నా టక రాష్ట్రం యాదగిరి జిల్లాకు చెందిన రమేశ్(29) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. దద్దనాల ప్రాజెక్టు మలుపు రోడ్డు వద్ద ఎదురె దురుగా వస్తున్న రెండు భారీ లారీ ట్యాంకర్లు ఢీకొనడంతో కర్నాటకకు చెందిన వాహనం డ్రైవర్ రమేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

కొబ్బరి సాగుకు ప్రోత్సాహం

- ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఉద్యానశాఖ డీడీ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. కొబ్బరి సాగులో సాంకేతిక పరిజ్ఞానంపై శనివారం కర్నూలు నగరంలోని ఉద్యాన భవన్‌లో సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొబ్బరి సాగుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా అందజే యాలో అవగాహన కల్పించేందు కోసం పెద్ద ఎత్తున ఉద్యానశాఖ అధి కారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.వైఎస్సార్ హార్టికల్చర్ యూనివ ర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త ఎం.తిరుపతిరెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వాతావరణం కొబ్బరి సాగుకు ఎంతో అనుకూలంగా ఉందని, రైతులు కొబ్బరితో పాటు ఇతర ఉద్యాన పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. కొబ్బరి పంటలో వ్యాపించే చీడపీడల నివారణకు ఏ విధమైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలో వారు రైతులకు వివరించారు. కోకో నట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమారవేలు మాట్లాడుతూ కొబ్బరి పంట సాగు చేయడం ద్వారా రైతులు ఏ విధంగా లాభం పొందుతారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుందో వివ రించారు. డీడీ ఉమాదేవి మాట్లాడుతూ కొబ్బరి పంట సాగు కోసం కోకో నట్ డెవలప్‌మెంట్ బోర్డు అందించే పథకాల గురించి వివరిం చారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ కొబ్బరి పంట యొక్క ప్రాముఖ్యత, అదే విధంగా కొబ్బరి పంట సాగు వల్ల వచ్చే ఆదాయాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, ఏపీడీ రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- రూ.1.76 లక్షల నగదు, 20 గ్రాముల బంగారు అభరణాలు



దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద శనివారం అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సోమన్నతో పాటు సీఐ శ్రీరామ్ విలేకరుల వివరాలను వెల్లడిం చారు. ఆలూరు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గోవిందరా జులు, నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని చిరుమాన్ పేటకు చెందిన ఎరుకలి బండిచిన్న అనే వ్యక్తులు చిన్నచిన్న దొంగతనాలకు పాల్ప డుతూ ఉండేవారు. ఈ ఇద్దరు మరో ఇద్దరిని కలుపుకుని దొంగతనాలు చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. అందులో భాగంగానే ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఒక కేసు, కర్నూల్‌లో ఒక కేసు వీరిపై నమోదు అయ్యాయని తెలి పారు. ఈ కేసులలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ఇటీవల ఎస్పీ బిందు మాధవ్ రికవరీ విషయాల్లో చాలా వెనకబడ్డారని, ప్రత్యేక టీం ఏర్పాటు చేసుకుని పురోగతి సాధించాలని సూచించారు. దీంతో డీఎస్పీ సోమన్న తనదైన శైలిలో వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌తోపాటు సిబ్బం దిని ఒక టీముగా ఏర్పాటు చేసి రికవరీపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే ఆలూరు చెందిన గోవిందరాజులతోపాటు డోన్ పట్టణంలోని చిరుమాన్ పేటకు చెందిన ఎరుకలి బండి చిన్నాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 80 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు, రూ.1.76 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదోని పట్ట ణంలోని మూడు కేసులు, కర్నూల్‌లోని ఒక కేసుకు సంబంధించిన నగ దుతో పాటు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో భాగం గానే ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రూ.1.24 లక్షలు, ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 45 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.50వేల నగదును, కర్నూలులోని నాలుగో పట్టణ పరిధిలోని 40గ్రాముల బంగారం ఆభరణాలును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.6.24లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు రూ.1.76లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసు కున్న ప్రత్యేక టీం అయిన శ్రీరామ్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ సత్తార్ వలి, పోలీసులు లక్ష్మన్న, అశోక్ కుమార్, మునిస్వామి, రామచంద్రలను డీఎస్పీ సోమన్న ప్రత్యేకంగా అభినందించారు. వీరికి నగదు బహుమతి అందించేందుకు ఎస్పీకి సిఫారసు చేసినట్లు డీఎస్పీ సోమన్న తెలిపారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా సింధూ సుబ్రహ్మణ్యం



ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను కలిసిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ పి. సింధూ సుబ్రహ్మణ్యం శని వారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జీజీహెచ్‌కు ఎన్నడూ లేని విధంగా పరి పాలనకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పి. సింధూ సుబ్రహ్మణ్యంను నియమించింది. ఈ మేరకు విధుల్లో చేరిన డిప్యూటీ కలెక్టర్ కర్నూలు జీజీహెచ్ ఇన్ చార్జి సూపరింటెండెంట్ డా.కే. సీతారామ య్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సింధూ సుబ్రహ్మణ్యం సీని యర్ ఐఏఎస్ అధికారి డా.పి. సుబ్రహ్మణ్యం కూతురు. వీరిది నెల్లూరు జిలా. డిప్యూటీ కలెక్ట ర్‌గా కోనసీమ జిల్లాలో మొదట పని చేసిన సింధూ సుబ్రహ్మ ణ్యంను ప్రస్తుతం కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆసు పత్రిలో సెక్యూరిటీ, పారిశుధ్యం, ల్యాండ్రీ బయోమెడికల్ పరిక రాలు నిర్వహణ ఏజెన్సీ పను లను పర్యవేక్షించనున్నారు.

వైసీపీ తీరు హాస్యాస్పదం: మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వంపై నిందమోపు గా ఆ పార్టీ నాయకులే ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో శనివారం విలేక రుల సమావేశం ఏర్పాటు చేశారు. జగన్‌ను ఉద్దేశించి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మీరు పెంచిన విద్యుత్ చార్జీలపై మీరు ధర్నాలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ చేస్తున్న ధర్నాలకు ప్రజల్లోనేకా కుండా సొంత పార్టీలోనే నాయకులు, కార్యకర్తలనుంచి ఎలాంటి స్పందన కనబడటం లేదని అన్నారు. అధికారం కోల్పోయి ఏం చేయాలో తోచక కూటమి ప్రభుత్వంపై బురదజల్లాలనే ఉద్దేశంతో వైసీపీ ఉందన్నారు. జగన్ విధ్వంసం చేసిన విద్యుత్‌శాఖను సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నా రన్నారు. 22.5మిలియన్ యూనిట్ల కొరత ఉన్నా రాష్ట్రాన్ని 2019నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దితే వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రూ.35వేల కోట్ల విద్యుత్‌భారం మోపడమే కాకుండా రూ.1.20లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్‌శాఖకు తెచ్చిపెట్టిందని అన్నారు. గుట్టుచప్పుడుకా కుండా డిస్కంలతో ప్రజలపై భారం వేయండని ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది మీ హయాంలో కాదా? అని సూటిగా ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్‌శాఖలో జరిగిన అవకత వకలు, నష్టాన్ని సవరణ చేసే బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నార న్నారు. ఏటా విద్యుత్ వినియోగం సగటున 6శాతం పెరుగుతోందని దానికి తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తిని కూడా పెంచా ల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడే వీటీ పీఎస్, కృష్ణపట్నం జెన్‌కో ప్లాంట్ల సామ ర్థ్యాన్ని విస్తరించామని, కానీ జగన్మోహన్‌రెడ్డి వాటిని పూర్తి చేయలేకపోయారని విమర్శిం చారు. జగన్ చేసిన పెద్ద పొరపాటు పీపీఏ లను రద్దు చేయడమని, వాటి రద్దువల్ల 8వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. ఆ 8వేల మెగావాట్ల పునరుత్పా దక విద్యుత్‌ను సీఎం చంద్రబాబునాయుడు అందుబాటులోకి తీసుకువ చ్చారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క మెగా వాట్ కూడా విద్యు దుత్పత్తి చేయలేదని అన్నారు. రాష్ట్రానికి జగన్ చేసినంత నష్టాన్ని ఏ పార్టీ నాయకుడు చేయలేదని మండిపడ్డారు.

ఇద్దరికి గాయాలు

పత్తికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పత్తికొండ శివారులో ఉరుకుం ద ఈరన్న దేవాలయం వద్ద బైకును కారు ఢీకొన్న సంఘటనలో శనివారం ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పట్టణానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శ్రీనివాసులు, పక్కృద్దీన్ ఉరుకుంద ఈరన్న దేవాలయం వద్ద మోటార్‌సైకిల్‌పై రోడ్డుకు అవతలి వైపుకు వెళుతుండగా మంత్రాలయం నుండి చెన్నై వెళుతున్న భక్తుల కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరిద్దరు గాయపడడంతో పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నారు.

నగల్లపాడులో చోరీ

4 తులాల బంగారు నగలు, రూ. 25 వేలు అపహరణ

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామంలో మౌలాలి ఇంట్లో పట్టపగలు దొంగలు బీరువాను పగలగొట్టిన బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. గృహానికి వేసిన తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి 4 తులాల బంగారు నగలు, రూ.25 వేలు నగదును తీసుకెళ్లినట్లు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మౌలాలి విధుల నిమిత్తం పాఠ శాలకు వెళ్లారు. పొలం పనుల నిమిత్తం వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో మౌలాలి ఆయన భార్య సమాచారం అందించారు. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెడ్‌కాని స్టేబుల్ శంకర్, పోలీసులు చోరీ జరిగిన గృహం వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహానందిలో ప్రదోషకాల పూజలు



నందీశ్వరునికి పూజలు చేస్తున్న వేదపండితులు

మహానంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్గశిర బహుళ త్రయోదశి మహా ప్రదోషం పురస్కరించుకొని మహానంది ఆలయంలో రాతి నందీశ్వరునికి ఆలయ వేదపండితులు వైభవంగా పూజలు నిర్వహించారు. శనివారం ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి అభిషేకం తోపాటు ప్రదోష నందీశ్వరాభిషేకం వేదమంత్రాలతో నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు మామిళ్లపల్లి రఘుశర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

● కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంతజూటూరును టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవుకు బోటింగ్, రెస్టారెంట్ నిర్వహణకు టెండర్లు పిలిచి ఖరారు చేయాలని ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో బోట్లలో ప్రయాణానికి సంబంధించి తొమ్మిది రకాల అనుమతులు తీసుకోవాలని, సంబంధిత అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. బిల స్వర్గం, వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డీవీఎం చంద్రమౌళి, డీఈ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా ఫారెస్టు అధికారి నాగమునేశ్వరి పాల్గొన్నారు.

వేలాల ద్వారా రూ.9.10 లక్షల ఆదాయం

మహానంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహానందిలో భక్తుల వసతి కల్పనలో భాగంగా శనివారం నిర్వహించిన వివిధ బహిరంగ వేలాల ద్వారా రూ.9.10 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేలల్లో ఐదేళ్ల కాలపరిమితి కింద ఆలయం వద్ద భక్తులకు ఊదిబత్తీలు విక్రయించే హక్కును మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్‌కు చెందిన కనుమర్లపూడి మస్తాన్‌రావు రూ.9.10 లక్షలకు అధికంగా పాటపాడి దక్కించుకున్నట్లు ఈవో తెలిపారు. నందీశ్వర కంకణాలను సరఫరా చేసే హక్కును నంద్యాలకు చెందిన ఓంశ్రీ సాయి స్టోర్స్ రూ.2 ప్రకారం దక్కించుకున్నట్లు వెల్లడించారు. మిగతా వాటికి ఆశించినంత స్థాయిలో బహిరంగ వేలంలో కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకుల అభివాదం

నంద్యాల రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం ఎస్ఎఫ్ఐ తిరువనంతపురంలో ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నామని పేర్కొన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్య కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సందీప్, హర్ష, ఉదయ్, పవన్, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి నాగపడగ



ఈవోకు వెండి నాగపడగను అందజేస్తున్న భక్తులు

పాణ్యం, డిసెంబరు 28: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శనివారం భక్తులు వెండి నాగపడగను బహూకరించినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. బనగానపల్లెకు చెందిన మేడం వెంకటసుబ్బమ్మ కుమారుడు సురేంద్రశెట్టి సతీమణి సుప్రదీప్తి, కుటుంబ సభ్యులు రాఘవేంద్ర, శ్వేత, రాజేష్, రమ్యలు స్వామివారికి రూ.4 లక్షల విలువైన మూడు కిలోల 900 గ్రాముల వెండి నాగపడగను అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, నారాయణ శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

గడివేముల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో టెంకాయలు, పూజా సామగ్రి విక్రయించుకు నేందుకు శనివారం వేలం పాటలు నిర్వహించగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామాలింగారెడ్డి తెలిపారు. పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి సమక్షంలో వేలం పాటలు నిర్వహించగా నాయుడు రూ.42 వేలకు హెచ్చుపాట పాడారని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.2 వేలు ఆదాయం పెరిగిందని ఆలయ ఈవో తెలిపారు.

అన్నప్రసాదం పరిశీలన



అన్నప్రసాద వితరణ విభాగాన్ని పరిశీలిస్తున్న ఈవో



నందీశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ విభాగాన్ని శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో వంటశాలలో వండిన వంటకాలు, ప్రాంగణాన్ని, వంట పదార్థాలు, కూరగాయలు భద్రపరచు గదులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులతో అన్న ప్రసాద వితరణపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా అన్నప్రసాద వితరణలో వండిన ప్రతీవంటకం కూడా ప్రతీ భక్తుడికి అందేవిధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. అదేవిధంగా రోజువారిగా ఉపయోగించే కూరగాయలు తాజాగా ఉండేలా చూడాలని, అన్నప్రసాదాలు తయారు చేసే ప్రాంగణం శుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వచ్చిన భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ఉదయం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అల్పాహారాన్ని ప్రారంభం సమయాలను పాటించాలని, సిబ్బంది అంతా భక్తులతో మర్యాదగా నడుచుకునేల చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీశైల క్షేత్రంలో శనివారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయం ప్రదోష కాలంలో ఆలయంలోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువై ఉన్న నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, పలు ఫలోదకాలు, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. అభిషేకానంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్ర సమర్పణ, విశేష అర్చనలు జరిపి, నాన బెట్టిన శనగలను సమర్పించారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్ర నామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవల ద్వారా అవకాశం కల్పించింది. ఒక్కో పూజకు రూ.1,116 సేవా రుసుమును చెల్లించి పాల్గొనవచ్చు.

గో సంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలకు శనివారం గో సంరక్షణ పథకం కింద హైదరాబాదుకు చెందిన కె.శ్రీనివాస్ అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం సాయంత్రం నెల్లూరుకు చెందిన శివసాయి కళానిలయం బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాఢ వీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శివాష్టకం, మూషిక వాహన, గణపతి కౌత్వం, శివతాండవ స్తోత్రం, గణపతి ప్రార్థన, నమశ్శివాయతే, తదితర గీతాలకు బృంద, సుదర్శన, అక్షర, పూజ్యస్రిత, తేజస్విప్రజ్ఞ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం గుంటూరుకు చెందిన సోమవరపు సాంబశివరావు అనే భక్తుడు రూ.1,00,001 విరాళాన్ని పర్యవేక్షకులు ఎం. మల్లికార్జునకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

నిర్మాణాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ ఇమ్రాన్‌పాషా

నంద్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీఎంజేవీకే పథకం ద్వారా మంజూరైన ముస్లిం మైనార్టీ భవన సముదాయాల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్‌పాషా, గౌరవాధ్యక్షుడు ఎస్ఎండి అబు లైస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని కార్యాలయంలో ఆల్‌మేవా, నంద్యాల ముస్లిం జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పీఎంజేవీకే పథకం నుంచి రూ.26.13 కోట్ల నిధులను మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో మైనార్టీ సంక్షేమం, విద్యాభివృద్ధికి, జూనియర్ కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మౌలానాఅబ్దుల్లా రషాది, మస్తాన్, బాషా, మహమ్మద్ రఫీ, నబిరసూల్, మునీర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొత్తపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉమారాణి అన్నారు. శనివారం మండలంలోని కొక్కెరంచ గ్రామ సచివాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొక్కెరంచలో భూ కొలతల కోసం రైతులు 5 దరఖాస్తులు, ఆన్‌లైన్ కోసం మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు వేణుగోపాల్‌గౌడు, అశోక్, శ్రీనివాసులు, మౌలాలి, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

చలానాలు చెల్లించాలి

పాములపాడు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనాల పెండింగు చలానాలు చెల్లించాలని ఎస్ఐ సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం పాములపాడులో కేజీ రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించి ట్యాక్సు, ఇన్సూరెన్సు పొల్యూషన్, ఆర్‌సీలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపరాదని తెలిపారు. రహదారి సూత్రాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ఆత్మకూరురూరల్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం నాగలూటి గూడెం గ్రామ శివార్లలోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని, ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 2700 లీటర్ల బెల్లపు ఊటను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో పంపిణీ చేయండి

గడివేముల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని తహసీల్దార్ వెంకట రమణ రేషన్ డీలర్లను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు నిబంధనలకు అనుగుణంగా షాపులు నిర్వహించాలని అన్నారు. రేషన్ దుకాణాల వద్ద ధరల పట్టికలను ఉంచాలని అన్నారు. పూర్తి స్థాయి కోటకు డీడీలు చెల్లించాలని అన్నారు.

నిర్మాణాల పరిశీలన

పాములపాడు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లను ఎంపీడీవో చంద్రశేఖర్, ఉపాధి సిబ్బందితో కలిసి పరిశీలించారు. శనివారం బాన కచెర్ల, వేంపెంట గ్రామలలో ఉపాధి హామీ నిధుల ద్వారా జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సకాలంలో షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరగా వస్తాయని తెలిపారు.కార్యక్రమంలో జేఈ రమేశ్‌నాయుడు, టీఏ బూషమ్మ, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి పాటుపడుతా



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి పాటుపడతానని నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నరహరి సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక శ్రీవాసవి కళ్యాణ మండపంలో ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కండెశ్యామ్ సుందర్‌లాల్, అధ్యక్షులు భవనాసి నాగ మహేష్‌లు నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. గతంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన భీమిశెట్టి కృష్ణమూర్తికి ప్రస్తుత కమిటీలో గౌరవాధ్యక్షునిగా అవకాశం కల్పించారు.

హైందవ శంఖారావానికి కదిలి రండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని గన్నవరం సమీపంలో కేసరపల్లి గ్రామంలో జనవరి 5వ తేదీ లక్షలాది హిందువులతో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ ఉంటుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్ర మౌళీశ్వరరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నంద్యాల విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో .హైందవ శంఖారావం రవాణా ప్రముఖ్ రాంప్రసాద్, రామాంజనేయులు, కన్న య్య, నాగరాజు, శేషసాయి పాల్గొన్నారు.

కూలీలకు జాబ్‌కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఆత్మకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి హామీ పథక జాబ్‌కార్డులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఏడాదిలో 200 పని దినాలను కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఈశ్వరమ్మ, స్వాములు, పకీర్‌సాహేబ్, కర్ల పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్యాయం

పాణ్యం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్యాయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాణ్యంలోని ఏపీ గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించారు. 45 రోజులుగా ఉపాధ్యాయులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాల పరిస్థితిని ప్రిన్సిపాల్ కృష్ణనాయక్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులు ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నష్టపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం

ఎమ్మెల్యే గౌరు చరిత



రైతులకు ఎల్పీఎం పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని నెరవాడ గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యేతోపాటు నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సభలో మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనం తరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ భూములను అన్యాక్రాం తం చేసిందన్నారు. ఉచిత గ్యాస్, పింఛన్ పెంపు, మెగా డీఎస్సీ వంటి హామీలు నెరవేర్చామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ కన్వీనర్ గణపం జయరామిరెడ్డి పాణ్యం మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలని, గగ్గటూరు మునుకుంద వాగు వంతెన, కొనిదేడు వద్దెల వాగు వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు పార్వతమ్మ, సర్పంచ్ శారదమ్మ, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీలు భాస్కరరెడ్డి, రంగ రమేష్, సాగునీటి సంఘం అధ్యక్షులు నారాయణరెడ్డి, ఈఓ రామకృష్ణ, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ రాము పాల్గొన్నారు.

యువత పెడదోవతో జీవితాలు నాశనం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ అఖిల

పాణ్యం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : యువత పెడదోవ పట్టి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని నంద్యాల అబ్కారీ శాఖ ఎస్ఐ అఖిల అన్నారు. శనివారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత మాదక ద్రవ్యాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటోందని అన్నారు. సైబర్ క్రైం, ఈవ్‌టీజింగ్, మహిళల అక్రమ రవాణా తదితర విషయాల్లో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. 1930, 122, 100 వంటి హెల్ప్ లైన్ నెంబర్ల ద్వారా మోసపూరిత సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ దస్తగిరి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మహిళా పోలీసులు సునీత, లక్ష్మి, సూపరింటెంట్ శ్యాంబాబు, కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీవి అసత్యపు ప్రచారాలు

నందికొట్కూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అసత్యపు ప్రచారాలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని నందికొట్కూరు మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిపై అడుగులు వేగంగా వేస్తుండడాన్ని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండల కన్వీనర్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, షికల్ అహ్మద్, ఆర్జు శ్రీనివాసులు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

నందికొట్కూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా ఫ్లైయెర్ విడుదల చేశారు. మరింత సమాచారం కోసం 9154830286, 9182217075 సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత పాల్గొన్నారు.

ఘనంగా అంకాళమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ

పాణ్యం, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండంలోని కొండజూటూరు గ్రామంలో శనివారం అంకాళమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఏడు రోజుల్లో ఆలయాన్ని నిర్మించి ప్రతిష్ఠ పూర్తి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. వేదపండితులు సుబ్బశాస్త్రి, కృష్ణకుమార్‌శర్మ, కృపాకరశర్మల ఆధ్వర్యంలో యాగం నిర్వహించి అమ్మవారిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూఇయర్ ఆఫర్ చేసిన తంట

ఆత్మకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నాగమణి హోటల్ యజమాని శ్రీనివాసులు న్యూఇయర్ ఆఫర్ ప్రకటించి చిక్కుల్లో పడ్డాడు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31 రాత్రి 7గంటల నుంచి 11 గంటల వరకు తమ హోటల్‌లో బిర్యానీ కొనుగోలు చేసే వారికి వినూత్నమైన ఆఫర్ ప్రకటించాడు. తన హోటల్‌లో రూ.300 చెల్లించి మటన్ బాస్మతీ బిర్యాని, రూ.200 చెల్లించి చికెన్ బాస్మతి బిర్యాని పార్శిల్‌గా కొనుగోలు చేసినట్లయితే క్వాటర్ మద్యం సీసా ఇస్తామంటూ మందుబాబులకు గాలం వేసే ప్రయత్నం చేశాడు. అంతేకాదు బిర్యానీ కొనుగోలు చేసినట్లయితే అలాంటి వారికి క్వాటర్ సీసా టోకెన్ ఇస్తామని, ఆత్మకూరు పట్టణంలోని నాలుగు మద్యం దుకాణాల్లో ఎక్కడైనా మద్యం తీసుకునే వెసులుబాటు ఉందంటూ ప్రత్యేకమైన ఫ్లెక్సీని ఏర్పాటు చేయించి సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసుకున్నాడు. ఎస్ఐ నారాయణరెడ్డి పోలీసుస్టేషన్‌కు పిలిపించి మందలించారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

పాములపాడు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

లలితా సహస్ర నామ పారాయణం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వాసవీ ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు భక్తి శ్రద్ధలతో లలితాదేవి సహస్ర నామ అఖండ పారాయణం నిర్వహించారు. వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి శ్రీనివాస ఆధ్వర్యంలో మహిళామండలి నిర్వాహకు లు ఇందుమతి, శోభారాణి నిర్వహణలో లలితాదేవి సహస్రనామ పారాయణం నంద్యాల అమ్మవారిశాలలో కార్యక్రమం నిర్వహించారు.

● నంద్యాల తెలుగుపేటలో వెలసిన లక్ష్మీమద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఉత్సవమూర్తు లకు పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయల్, అర్చకులు రామ్మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మహిళలు

ప్రజాగ్రహానికి గురైనా బుద్ధి రాలేదు

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోయిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పదిసార్లు విద్యుత్ చార్జీలుపెంచి ప్రజలపై భారాలు మోపిన జగన్ రెడ్డి అధికా రం కోల్పోయిన తర్వాత విద్యుత్ చా ర్జీలు తగ్గించాలన్న పేరుతో వైసీపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. జగన్ తన పద్ధతిని మార్చుకోకపోతే ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

వైసీపీ హయాంలో వెనుకబాటు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం అన్నారు. వైసీపీ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసీపీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

విద్యుత్ పాపం జగన్‌దే

● రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సుబ్బారెడ్డి



డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు పాపమంతా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిదే అని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పదిసార్లుకు పైగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ వైఖరి వల్లనే ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని తెలిపారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరిని మార్చు కోవాలని సూచించారు.

అర్హులకు న్యాయం చేయండి: బీజేపీ



ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులగణన చేపట్టిందని వీటిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి అన్నారు. శనివారం డోన్ ఆర్డీవో కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు కులధృవీకరణ నమోదు చేయించుకునే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రిస్టియన్ మతం తీసుకునేవారికి పూర్వ మతంపై కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇవ్వరాదని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నంద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రికి ఆపాదించడం సరికాదు'

డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్లలో బఫర్ గోడౌన్‌కు సంబంధించిన వ్యవహారంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేరును ఆపాదించడం సరికాదని బేతంచెర్ల వైసీపీ నాయకులు అన్నారు. శనివారం సాయంత్రం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీ నాగభూషణం రెడ్డి, వైసీపీ నాయకుడు చంద్రారెడ్డి మాట్లాడారు. బేతంచెర్ల బఫర్ గోడౌన్‌లో జరిగిన బియ్యం తనిఖీలకు సంబంధించి నివేదికను అధికారులు వెల్లడిస్తారని, వాటి ద్వారా వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. బఫర్ గోడౌన్‌కు సంబంధించిన వ్యవహారంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, బేతంచెర్ల వైసీపీ నాయకులు ముర్తుజావలి, ఖాజా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పట్ట పగలే తరలుతున్న నాటుసారా

కొలిమిగుండ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనిషుల ప్రాణాలను హరిస్తున్న నాటు సారా పట్టపగలే విచ్చలవిడిగా రవాణా అవుతోంది. మండలంలోని వివిధ గ్రామాల ప్రధాన రహదారుల్లో పట్టపగలే నాటుసారా బైకులు హల్‌చల్ సృష్టిస్తున్నా అడిగేవారు లేరు. అవుకు మండలంలోని కొండమీద పల్లెల నుంచి ప్రతి రోజూ వందలాది లీటర్ల నాటుసారా మండలంలోని గ్రామాలకు దిగుమతి అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పలు గ్రామాల్లో ముగ్గురు, నలుగురు నాటుసారాను బహిరంగంగానే విక్రయిస్తున్నారు. పోలీసులు ఉన్నతాధికారుల టార్గెట్ కోసం కేవలం కేసులు నమోదు చేయడం తప్ప, నాటుసారా నిర్మూలకు ఎంతమాత్రం చర్యలు తీసుకోవడం లేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారు లు స్పందించి గ్రామాల్లో నాటు సారాను అరికట్టాలని కోరుతున్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆళ్లగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. పడకండ్ల గ్రామ పరిధిలోని కేపీజీ హైస్కూల్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పురపాలక సంఘం పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ సమావేశ భవనంలో కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్లు నాయబ్ రసూల్, మరియమ్మ, కౌన్సిలర్లు, పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.

బాల బాలికలు సమానమే

రుద్రవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పౌరుల ఆలోచన ధోరణి మార్చే సమయంలో బాలబాలికలు అందరూ సమానమేనని పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం రుద్రవరం ఆదర్శ పాఠశాలలో బేటిబచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. 'నా బనగానపల్లె, నా ఆరోగ్యం' పేరుతో పట్టణంలో ర్యాలీ చేపట్టిన అనంతరం ఉన్నత పాఠశాలలో ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత బనగానపల్లె లక్ష్యంగా బీసీ ఇందిరమ్మ చేపట్టిన ఉద్యమా నికి బనగానపల్లె ప్రజలు వ్యాపారులు, విద్యాసంస్థలు అన్ని వర్గాల ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. బీసీ ఇందిరమ్మ ఎంతో పట్టుదలతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన తీసుకువచ్చారన్నారు. ప్రతి మహిళకు ఇందిరమ్మ ఎంతో స్ఫూర్తిదాయక మన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ బీసీ ఇందిరమ్మ చేస్తున్న ప్రయత్నానికి పట్టణ ప్రజలు చేయి చేయి కలిపి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని అన్నారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ తాను మూడు నెలలుగా చేపట్టిన ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన సదస్సుల వల్ల ప్రజల్లో మార్పు వచ్చిందని చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వాడొద్దని చెబుతున్నారని, దీంతో ఇది విజయవంతమైనట్లు భావిస్తున్నానని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి క్లాత్ కవర్లు, బ్యాగులు వాడాలని సూచించారు. ప్రతినెలలో బనగానపల్లె పట్టణంలో 5 టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీ డీవో రమణ, నా యకు లు బీసీ రామనాథరెడ్డి, ప్రపంచ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షుడు టంగు టూరు శ్రీనయ్య, రిటైర్డు హెచ్‌ఎం పక్కీరెడ్డి, డోన్ ఆర్డీవో నరసింహులు, ఈ వోఆర్డీ సతీశ్‌రెడ్డి, టీచర్ నాగరాజు, వివిధ వ్యాపార సంస్థల అసోసియే షన్ చైర్మన్‌లు, ప్రైవేటు అసోసియేషన్ చైర్మన్లు, పొదుపు మహిళలు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సా యంత్రం బనగానపల్లె పట్టణం లోని మంత్రి క్యాంపు కార్యాల యం లో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వయంగా స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వారంలోగా పరిష్కరించాలి

అవుకు మండలం లింగంబోడు గ్రామంలో దేవుని మాణ్యం భూములకు సంబంధించిన సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను రోడ్లు భవ నాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి అవుకు మండలం లింగం బోడుకు చెందిన గ్రామస్థులు మూకుమ్మడిగా మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. దేవుని మాన్యం భూములు దేవుడికే చెందే విధంగా చర్యలు తీసుకోవాల ని మంత్రిని గ్రామ ప్రజ లు కోరారు.

దాడి అప్రజాస్వామికం

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు భౌతికంగా దాడులు చేయడం అప్రజాస్వామికమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శిం చారు. బనగానపల్లె ఎంపీడీవో రమణతో పాటు అవుకు, కొలిమిగుండ్ల, మహానంది మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ సిబ్బంది శనివారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడ డం అనైతికమని మంత్రి విమర్శిం చారు. ఇటువంటి దాడులతో వైసీపీ విష సంస్కృతికి తెరలేపుతోందని విమర్శించారు. గాయపడిన ఎంపీ డీవో జవహర్ కు అన్నివిధాలా సహకారం అందిస్తామన్నారు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి బీసీ తెలిపారు.

'గాలివీడు ఎంపీడీవోపై దాడి అమానుషం'

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండలపరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోపై దాడికి పాల్పడటం అమానుషమని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం ముందు సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కోరారు.

వేంకటేశ్వరుడికి కుంకుమార్చన

రుద్రవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మిగోదాదేవి అమ్మవార్లు, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాతపద్ధతిలో రాయల్టీ అందజేయాలి



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఫ్యాక్టరీ, గనులు, ట్రాక్టర్ల యజమానులు

బేతంచెర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాపరాళ్ల గనుల నుంచి ఫ్యాక్టరీలకు ట్రాక్టర్ల ద్వారా ఫ్యాక్టరీలకు రవాణా చేసేందుకు రాయల్టీని పాత పద్ధతిలోనే అమలు చేయాలని గనుల ఫ్యాక్టరీ ట్రాక్టర్ల యజమానులు డిమాండ్ చేశారు. శనివారం రిలే నిరాహారదీక్షల్లో మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి, నాగమయ్య మాట్లాడుతూ నాపరాళ్ల వ్యాపారం లేక గనుల ఫ్యాక్టరీల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో రాయల్టీ సమస్య ఏర్పడటంతో గనుల ఫ్యాక్టరీల ట్రాక్టర్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీలను పాత పద్ధతిలో యజమానులకు అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు. రాయల్టీల సమస్యలను పరిష్కరించేంత వరకు రిలే నిరాహారదీక్షలు చేస్తామని తెలిపారు. దీక్షలో మోహన్‌రావు, తిరుమలేష్ రెడ్డి, ఉపేంద్ర, ముస్తఫా తెలుగు వెంకటరమణ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన ఉండాలి



డోర్నిపాడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

డోర్నిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు స్వయం ఉపాధిపై కూడా అవగాహన కలిగి ఉండాలని జెడ్పీహెచ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. శనివారం డోర్నిపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వయం ఉపాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుర్రారెడ్డిపల్లె గ్రామంలో జరిగే మగ్గం వర్క్ గురించి, సచివాలయం సందర్శించారు. విద్యార్థులకు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నారాయణ పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఒకేషన్ ఇన్‌స్పెక్టర్ కంబగిరి రాముడు, ఉపాధ్యాయులు చెన్నయ్య, సరస్వతి, సునంద తదితరులు ఉన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.5.35 లక్షలు

బేతంచెర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.35 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. అలాగే చెన్నై కి చెందిన కమ్మరి బ్రహ్మయ్య ఆచారి కుమారుడు కమ్మరి విష్ణు ఆలయ దేవస్థానం అభివృద్ధికి రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారని ఆయన తెలిపారు. దాతలకు స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న కమిషనర్

బేతంచెర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురంగ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారి ముందున్న శ్రీచక్రానికి కుంకుమార్చన చేశారు. అనంతరం వేద పండితులు శేషవస్త్రంతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

అవగాహన ర్యాలీ

ఉయ్యాలవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శక్తి, మానవ పరిరక్షణపై ప్రతి ఒక్క రూ అవగాహన పెంచుకోవాలని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి బస్టాండ్ ఆవరణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు మురళీక్రిష్ణ, సాయివైష్ణవి, తనూష, వెంకటచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

ఉయ్యాలవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31లోగా దరఖాస్తు రూపంలో తెలియజేయాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 6,862 మంది షెడ్యూల్ కులాల వారు ఉన్నట్లు రిజిస్టర్ అయ్యిందన్నారు. దీని సంబంధించిన జాబితాను అన్ని గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. వాటిని పరిశీలించి ఏవేనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం జనవరి 10వ తేదీన తుది జాబితా వెలువడుతుందని ఆయన తెలిపారు.

బనగానపల్లె: ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు బనగానపల్లె సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రాముడు తెలిపారు. శనివారం బనగానపల్లెలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31లోగా సమర్పించాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బనగానపల్లె, డిసెంబరు 28, (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్ర హ్మానందాచారి కోరారు. శనివారం పలుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశా లలో వివిధ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం గౌరిశంకర్, ఉపాధ్యాయులు పరమేశ్వరుడు, లతీఫ్, రఫిక్, పీడీ శ్రీనివాసులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'జరిమానాలు చెల్లించాలి'

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల తనిఖీల్లో చలానా రూపంలో పడిన జరిమానాలు చెల్లించాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రిలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. గతంలో ఏవైన చలానాలు ఉంటే తక్షణమే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. గతంలో అధిక చలానాలు ఉండి కట్టని వారు తిరిగి పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నబీసాహేబ్, పోలీసులు ఉన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు సాగు చేసిన పంటలకు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం గడువు పొడిగించిందని అన్నారు. నెల చివరి వరకు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చని సూచించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని అన్నారు. ఆర్‌బీకేలలో పంట నమోదు చేసుకోవాలని అన్నారు. ఏఈవో మంజుల, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వసతి గృహం మరమ్మతులకు రూ.29 లక్షలు



చిన్నవంగలి హాస్టల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఈఈ, డీఈ

చాగలమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.29లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్‌శాఖ ఈఈ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని చిన్నవంగలి ఎస్సీ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం హాస్టల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఈ నిధులతో గదుల, మరుగుదొడ్ల మరమ్మతులు త్వరలో చేపడతామని అన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ కొండారెడ్డి, హాస్టల్ వార్డెన్ ఖాసీం, ఇంజనీరింగ్ సహాయకులు అనిల్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి చేపల చెరువుపై దాడి

- చేపలకు చికెన్ వ్యర్థాలను ఆహారంగా వేస్తున్న నిర్వాహకులు

అవుకు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్ల శింగవరం గ్రామ పరిధిలోని వైసీపీ నాయకుడి చేపల చెరువుపై ట్రాన్స్‌కో అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అవుకు ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య తన సిబ్బందితో కలసి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న చేపల చెరువుపై దాడులు జరిపారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో కనీసం విద్యుత్ అధికారులను సంప్రదించకుండానే 16 ఎకరాల్లో ఏడాదికి పైగా వైసీపీ నాయకుడు 2హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 3 మోటార్లను అమర్చి చేపల చెరువును నిర్వహిస్తున్నాడు. 1 కి.మీ దూరంలో ఉన్న అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైరును లాగి మోటార్లకు అమర్చాడు. విద్యుత్ మీటరు లేకుండానే అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ పక్కనే ఉన్న వాగు నుంచి మోటర్ల ద్వారా చేపల చెరువులోకి నీరు తరలిస్తున్నారు. విద్యుత్ వైరును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు ఏఈ పక్కీరయ్య తెలిపారు.

చేపలకు చికెన్ వ్యర్థాలను ఆహారంగా వేస్తున్న నిర్వాహకులు



వైరును తొలగిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ఈ చెరువులో చేపలకు ఆహారంగా ప్రత్యేకమైన పిండి పదార్థాలను వేయాలి. అయితే నిర్వాహకులు చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేస్తుండటం గమనార్హం. ఎన్‌హెచ్ రహదారి పక్కనే చేపల చెరువు ఉండటంతో చేపలకు ఆహారంగా వేసే చికెన్ వ్యర్థాలతో దుర్వాసన వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఈ చేపల చెరువును పరిశీలించి నిర్వాహకులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అవకతవకలకు పాల్పడితే చర్యలు

● తహసీల్దార్ నాగమణి



డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ తహసీల్దార్ నాగమణి హెచ్చరించారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని రేషన్ షాపులు ఉన్నాయి?

జవాబు: పట్టణంతో పాటు మండలంలో 72 రేషన్ షాపులు ఉన్నాయి. 36,100 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో 1545 అంత్యోదయ కార్డులు ఉన్నాయి.

ప్రశ్న: పలువురు డీలర్లు తూకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.. ?

జవాబు: డీలర్లు డబ్బాలు ఉపయోగిస్తూ తూకాల్లో అక్రమాలకు పాల్పడరాదు. ఒకవేళ అవకతవకలకు పాల్పడినట్లు రేషన్ కార్డుదారులు తమ దృష్టికి తెస్తే.. విచారణ చేసి ఆ రేషన్ డీలరుపై చర్యలు తీసుకుంటాము.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.. వచ్చిన అర్జీలు ఎన్ని ఉన్నాయి..?

జవాబు: మండలంలో 12 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 291 అర్జీలు వచ్చాయి. మరో 4 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. జనవరి మొదటి వారంలో రెవెన్యూ సదస్సులు మండలంలో ముగుస్తున్నాయి.

పట్టణ సీఐకి సత్కారం

డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాకు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు, ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సీఐ తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎల్ఐసీ ఆఫీసర్ యేసుదాసు, తదితరులు ఉన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులుగా ఉన్న రైతులు ఈ నెల 31లోపు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ సహకార సంఘం సీఈవో వెంకటసుబ్బయ్య కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి సహకరించి త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

డోన్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. శనివారం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున ఆహ్వానం మేరకు ఆయన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కొలిమిగుండ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కత్తి రాందాస్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం తెలుగు యువత అధికార ప్రతినిధి మందా విజయ్‌కుమార్, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు గాపాల్‌గారి దస్తగిరి, బాషా, మందా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రవికుమార్ తదితరులు గ్రామానికి చేరుకొని కత్తి రాందాస్‌ను పరామర్శించారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

పంట నమోదు తప్పనిసరి

కోవెలకుంట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు రబీలో సాగు చేసిన పంటలకు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన శనగ, మినుము తదితర పంటలకు పంట నమోదు కోసం ప్రభుత్వం డిసెంబరు 31 వరకు సమయం ఇచ్చిందన్నారు. రైతులు ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

కోవెలకుంట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుమారు ఆరు అర్జీలు వచ్చాయి. ఆ అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, సర్వేయరు వీరన్న, వీఆర్వోలు ఓబులేసు, సుజాత, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మండలం పడకండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గోరంట్ల మద్దిలేటి.. దివంగత ఎమ్మెల్యేలు భూమా శోభానాగిరెడ్డి, భూమా నాగిరెడ్డిల జ్ఞాపకార్థం వారి పేరుతో నూతనంగా నిర్మించిన శుద్ధజల కేంద్రాన్ని భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు.

ఘనంగా పోలూరి రాఘవరెడ్డి జన్మదినం



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్మ సంఘం నాయకులు

బేతంచెర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం సాయంత్రం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు భారీ కేక్‌ను కట్ చేశారు. అలాగే పోలూరు రాఘవరెడ్డి స్వగృహంలో డోన్ కమ్మ సంఘం అధ్యక్షులు వెంకటకృష్ణారెడ్డి చౌదరి నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మురళికృష్ణ, రామ్‌కిషోర్ చౌదరి, రవికుమార్, రాఘవరెడ్డి, తదితరులు ఉన్నారు.